
చదువులో మేటి

● డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్‌లో ఉత్తమ విద్యాబోధన
● 'పది'లో వందశాతం ఉత్తీర్ణత
● రాయలసీమ స్థాయిలో ఉత్తమ మునిసిపల్ పాఠశాలగా ఎంపిక
● నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న హెచ్‌ఎం


డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మునిసిపల్ హైస్కూల్

కర్నూలు సిటీ: పేరుకు తగ్గట్టే డా.ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్ విద్యాబోధనలో, ఫలితాల్లో ఉత్తమ పాఠశాలగా రాణిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ స్కూళ్లలో చదువుతున్న పేదల పిల్లల్లో ప్రతిభావంతుల కోసం 2020లో ఈ పాఠశాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ బాలాజీ చేసిన ప్రతిపాదనల మేరకు 6 నుంచి 10వ తరగతి వరకు తరగతికి 60 సీట్ల చొప్పున అనుమతులిస్తూ 2021 మార్చి 10వ తేదీన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ ఎం.ఎస్ నెంబరు 20ని జారీ చేశారు. ఒక్కో తరగతిలో 60 సీట్లలో 50 సీట్లు ప్రవేశ పరీక్ష ద్వారా, మిగిలిన 10 సీట్లు నగర పాలక సంస్థ కమిషనర్ నియంత్రణలో ఉంటాయి. 2021–22 విద్యా సంవత్సరంలో మొదటి బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 2022–23 విద్యా సంవత్సరంలో కూడా రెండో బ్యాచ్ విద్యార్థులు కూడా అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. స్కూల్‌కు చెందిన ఇ.సుశ్రిత అనే విద్యార్థి 600 మార్కులకుగాను 586 మార్కులు సాధించారు.ఈ స్కూల్‌లో చదివిన విద్యార్థుల సరాసరి మార్కులు 525. గతేడాది మొదటి బ్యాచ్‌లోనూ ఈ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించింది.

సీమలో ఏకైక స్కూల్

రాష్ట్రంలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలలను ఉత్తమ స్కూళ్లుగా ఎంపిక చేస్తారు. ఆగస్టు 15వ తేదీన వాటికి అవార్డులు అందజేస్తారు. ఏపీజీ అబ్దుల్ కలాం పాఠశాల వరుసగా రెండోసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. రాయలసీమలో మునిసిపల్ పాఠశాలల విభాగంలో ఈ ఘనత సాధించిన ఏకైక పాఠశాల ఇది. నేడు విజయవాడలో సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ స్కూల్ అవార్డును హెచ్‌ఎం విజయలక్ష్మి అందుకోనున్నారు. ఉత్తమ విద్యాబోధనతో పాటు పెరెంట్స్ సహకారం, విద్యాశాఖ అధికారుల సలహాలు, సూచనలు అమలు చేయడం వల్లే తమ పాఠశాల వరుసగా రెండోసారి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఆమె వెల్లడించారు.

● డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కర్నూలు(న్యూసిటీ): ఆర్‌యూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో సోమవారం నలుగురు విద్యార్థులు డిబారయ్యారు. 9,397 మంది పరీక్ష రాసినట్లు వీసీ తెలిపారు.

క్రైం కార్నర్

మందుబాబులకు జైలు శిక్ష

కర్నూలు : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మంది మందుబాబులకు ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పంచలింగాల చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ దుకాణాల వద్ద మద్యం సేవించి ద్విచక్ర వాహనాలపై 44వ నెంబర్ జాతీయ రహదారిపై కర్నూలుకు వస్తుండగా సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని సోమవారం ఉదయం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

కర్నూలులోని రెడ్‌క్రాస్ సొసైటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుజాత అనే మహిళ గాయాలకు గురైంది. భర్త మల్లికార్జునతో కలసి బైక్‌పై వెళ్తుండగా వాహనం గుంతలో పడటంతో వెనుక కూర్చున్న సుజాత కింద పడి గాయాలకు గురైంది. వీరు గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని కాలనీలో నివాసముంటారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

స్పోర్ట్స్

ఫెన్సింగ్ క్రీడలో ప్రతిభ

కర్నూలు(రూరల్):ఈ నెల 12, 13 తేదీల్లో రెండు రోజులు పాటు భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు కీర్తన్, ఉదయ్ కుమార్, జ్ఞానేష్, భరత్ కుమార్ బంగారు పతకాలు సాధించారు. సాబర్ బాలుర విభాగంలో నాగలక్ష్మి చరణ్, గీతానందన్,అఖిల్, ప్రణీత్ కుమార్ కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఫాయిల్ బాలికల విభాగంలో సాయి కీర్తన, దివిత, ఉమా, మంజుల బ్రాంజ్ పతకాలు సాధించినట్లు ఫెన్సింగ్ క్రీడ శిక్షకుడు మహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

క్రికెట్‌లో రాణించాలి

కర్నూలు(రూరల్): క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆదిమూలపు సతీష్ కోరారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న భారత క్రికెట్ క్రీడాకారుడు హనుమా విహారి, రంజీ ప్లేయర్ శివ చరణ్‌తో పాటు జట్టు సభ్యులను కలసి వారు అభినందనలు తెలిపారు.

మహనీయుల త్యాగఫలమే స్వాతంత్య్రం


భరతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: ఎందరో మహనీయుల త్యాగ ఫలంతోనే దేశానికి స్వాంతంత్య్రం సిద్ధించిందని ప్రభుత్వ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ చెన్నయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థల కరస్పాండెంట్ రాజశేఖర్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకల్లో భాగంగా స్థానిక విద్యానగర్‌లోని మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం 'భారత్ దర్శన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై భారత మాత చిత్ర పటానికి పూల మాలలు వేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగు జాడల్లో నడుస్తూ దేశ ప్రగతికి పాటుపడాలన్నారు. భారత్ దర్శన్ ప్రదర్శన కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించుటకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్‌ఎం కె.స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

● గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (రాజ్‌విహార్/టౌన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక 45వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కప్పల్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, సాధిక్ పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. స్థానిక ఖండేరిలోని నెహ్రూ, దామోదరం సంజీవయ్య మున్సిపల్ పాఠశాలల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం నాభూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు.ముందుగా పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే అమర వీరుల శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పేద పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు రూ. 69 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అనంతరం అమరవీరుల త్యాగాలను గుర్తు చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, విద్యార్థులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

పాతబస్తీ పెద్దపడఖానా ఏరియాలో నివసిస్తున్న 17 పేదకుటుంబాలకు సోమవారం ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. 15 ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఎంతో సంతోషించారు. అంతకు ముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన మహాయజ్ఞం


కుంకుమార్చన సమర్పిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసంను పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

డీఐజీ కార్యాలయం వద్ద కుక్కల బెడద

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక బి. క్యాంపు డీఐజీ కార్యాలయం వద్ద కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతంలో నివసించే గోవింద్ అనే వ్యక్తి మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషసాయి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందనలో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'వీరో కా వందన్'

కర్నూలు (న్యూసిటీ) : నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వీరో కా వందన్ కార్యక్రమం నిర్వహించారు. దేశ రక్షణలో సైనికుల పాత్రను రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు వివరించారు. అనంతరం మాజీ సైనికుడు విజయ ప్రకాష్‌ని సన్మానించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ జేఎండీ.షఫీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప పాల్గొన్నారు.

అందుబాటులో లేకపోతే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేకపోతే చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. సోమవారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి ఆయన కింద స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు.

తిరంగా ర్యాలీ

కర్నూలు కల్చరల్: భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల వారు 'నా మట్టి నా దేశం' కార్యక్రమంలో భాగంగా సోమవారం జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మునికుమార్ అధ్యక్షతన అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల నుంచి కొండారెడ్డి బురుజు వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.

● **కర్నూలు సిటీ:** స్థానిక బీ క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ర్యాలీని 2బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల శిలాఫలకం ఆవిష్కరణ

కర్నూలు (టౌన్): నగరంలోని 17 వ వార్డులో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ మేరీ మిట్టి– మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అమరవీరుల శిలాఫలకం ఆవిష్కరించారు. స్థానిక కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డి అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంతో మంది మహనీయుల త్యాగ ఫలమే స్వాతంత్య్రమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నాగశివ ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మద్దమ్మ పాల్గొన్నారు.

నేడు 'పడమటి గాలి' సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో మంగళవారం 'పడమటి గాలి' సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. కళాభిమానులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీక్షించాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

ఇంధన పొదుపు పాటించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ఇంధన పొదుపు పాటించాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. సోమవారం ఆయన డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా డీజిల్‌ను ఆదా చేసే సూత్రాలను ప్రతి డ్రైవర్ పాటించాలని సూచించారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: వైఎస్‌ఆర్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 19వ వార్డు మదర్‌ల్యాండ్, సోమిశెట్టి నగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో జీవనోపాధులు మెరుగుపర్చుకోవాలన్నారు. జనరంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, లక్ష్మిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పచ్చదనం

మొక్కలు పెంచడంతో పచ్చదనం పెరుగుతుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులోని శరీన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, శ్వేతారెడ్డి, కల్లూరు జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.